# చిట్కా

- అయ్యగారి శ్రీనివాసరావు



కనకరాజు ఇంటికి అతడి భార్య దూరపుబంధువు ప్రవీణ్ వచ్చాడు. కనకరాజుకి పెళ్ళై రెండేళ్ళయినా ఎన్నడూ వారింటికి రాలేదతడు. ఇప్పుడైనా ఏదో ఆ ఊర్లో ముఖ్యమైన పని ఉండడంతో వచ్చాడు. ఎలాగూ వచ్చాను కదా అని బంధువుల అమ్మాయిని చూసి పోదామని వచ్చాడు ప్రవీణ్.

ప్రవీణ్‌ని చూడగానే కనకరాజు ఎంతో ఆప్యాయత చూపించాడు.

అతడు వచ్చినందుకు ఆనందాన్ని వ్యక్తపరిచాడు.

"రాక రాక మీరొస్తే మీతో గడపలేకపోతున్నాను" అని బాధపడ్డాడు.

ఎందుకంటే కనకరాజుకి ఏదో అర్జెంట్ పని ఉండి బయటికెళ్ళిపోతున్నాడు.

"అయితే వెళ్ళొస్తానండీ" అన్నాడు ప్రవీణ్.

అది చూసిన కనకరాజు "అదేంటండీ. రాకరాక వచ్చారు. భోజనం చెయ్యకుండా వెళతారా?" అంటూ తను వద్దంటున్నా బలవంతంగా భోజనానికి ఉంచేశాడు కనకరాజు. అంతేకాదు అతడు బయటికెళుతూ అతని భార్యనుద్దేశించి.

"ఏమోయ్! మీ అన్నయ్య వచ్చాడట కదా. నేని వాళ భోజనానికి రావడానికి అవదు. అందుకని ఈరోజు రెండు ఒకటి చేసి ఒకటి రెండు చెయ్యి. మరిచిపోకు" అని చెప్పేసి బయటికి వెళ్ళిపోయాడు.

ఆ మాటలకి అర్థం ఏమిటో తెలియకపోయినా మనసులో మాత్రం ఆనందించాడు. ఎందుకంటే తన బావ గురించి అందరూ పిసినారి అనడం విన్నాడు ఇదివరలో. కానీ కనకరాజుని చూస్తే అలా అనిపించ లేదు. అప్పుడనుకున్నాడు.

'గిట్టనివాళ్ళు అతడ్ని గురించి చెడుగా చెప్పుకున్నారులే' అని.

భోజనానికి ఇంకా టైం ఉంది కదాని చెల్లెలుకి చెప్పి బయటికెళ్ళాడు ప్రవీణ్.

అక్కడ అతడి పని ఇప్పుడప్పుడే అయ్యేలా అనిపించేట్లు లేదు. మధ్యాహ్నం రమ్మన్నారు.

అందుకే ఇంటి దగ్గర తన చెల్లెలు తన కోసం భోజనం చెయ్యకుండా కూర్చుంటుందని అనిపించి హడావిడిగా ఇంటికి చేరాడు. ఇంటికి చేరేసరికి ఒంటి గంటయింది. కానీ ఇంటికొచ్చేసరికి తను ఆతృత పడినంత సీనేం లేదు. చెల్లెలు వంట ప్రయత్నంలోనే ఉంది ఇంకా.

అప్పుడనిపించింది ప్రవీణ్‌కి. 'బావ ఒకటి రెండు చేసి రెండు ఒకటి చెయ్యమన్నాడు కదా!' అంటే ఏవేవో వెరైటీలు, పిండి వంటలు చెయ్యమని కోడ్ భాషలో చెప్పుంటాడు. పాపం ఒక్కర్తీ చెయ్యాలి కదా! ఆలస్యం అవవచ్చు' అనుకుంటూ కడుపు ఆకలితో నకనకలాడుతున్నా చెల్లెలు పిలిచే పిలుపు కోసం ఎదురుచూస్తున్నాడు.

అసలే ప్రయాణం చేసి రావడం, పని అవ్వలేదని కంగారు, దానికి తోడు భోజనం ఆలస్యం.

ఒంటిగంటన్నరైంది. ఆకలి పెరిగింది. రెండయింది. నీరసం వస్తోంది.

మూడయింది. సహనం నశిస్తోంది. అయినా ఏమీ అనలేడు. బయటికెళ్ళిపోలేడు. ఎందుకంటే ఆమె దూరపు చుట్టం. అంత చనువులేదు. బయటికెళ్ళి పని చేయించుకునే టైం అయిందనే ఆతృత. అలాగని ఏమీ అనలేడు. బయటికిపోలేడు. ధర్మ సంకటంలో పడ్డాడు. పనీ అవలేదు. ఇక్కడ ఊసు పోవడంలేదు. అలాంటి సమయంలో ఎట్టకేలకు కనకరాజు భార్య భోజనానికి రమ్మని పిలిచింది.

'బతుకు జీవుడా!' అనుకుంటూ భోజనానికి లేచాడు.

అప్పటికి టైం నాల్గైంది. ఇప్పటికైనా భోజనానికి పిలిచినందుకు సంతోషించి భోజనానికి కూర్చున్నాడు.

వడ్డించిందే తడవుగా ఆదరాబాదరాగా అన్నీ తినేశాడు. ఎక్కువో, తక్కువో, రుచో, అరుచో ఏదీ పట్టించుకునే స్థితిలో లేడతను. కానీ కాస్త స్థిమితపడ్డాక చూసుకుంటే తను ఇంతవరకూ తిన్న కూర, పులుసూ రెండూ కూడా తోటకూరతో చేసినవే. పోన్లే అనుకుని భోజనం పూర్తిచేసేశాడు.

ఇందాక తన బావ అన్నమాటలకి అర్థమైనా తెలుసుకుంటే బావుంటుందనిపించి చెల్లెల్ని అడిగాడు.

"అమ్మా! బావగారిందాక ఒకటి రెండు చేసి, రెండు ఒకటి చేయమన్నాడు కదా దానర్థం ఏమిటి?" అని.

దానికామె సిగ్గుపడుతూనే-

"ఏంలేదన్నయ్యా. ఒకటి రెండు చెయ్యడమంటే ఒకే కూరని రెండురకాలుగా చెయ్యమని అర్థం. అందుకే తోటకూరతో రెండురకాలు చేశాను" అంది.

ఆ మాట విన్న ప్రవీణ్ బుర్రగిర్రున తిరిగింది. ఆ స్థితిలోనే "రెండు ఒకటి చెయ్యమంటే కొంపదీసి రెండు పూటలా భోజనం ఇలా మధ్యాహ్నం కాక, రాత్రి కాక, సాయంత్రం పెట్టమని అర్థం కాదు కదా!" అన్నాడు ఏడ్వలేక నవ్వుతూ.

ఆమాట కామె "భలే కనిపెట్టేశావన్నయ్యా. ఖచ్చితంగా అంతే!" అంది.

అలా అందేగాని పక్కకు తిరిగి పైటకొంగుతో కన్నీళ్ళు తుడుచుకోవడం ప్రవీణ్ దృష్టిపథం నుంచి దాటిపోలేదు. మర్యాద పోకుండా మర్నాటికి మరెవరూ తన ఇంటికి రాకుండా ఇలాంటి చిట్కా పాటించిన బావ పీనాసితనాన్ని, భర్త మాటకి ఎదురుచెప్పలేని సగటు భారతనారి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన ప్రవీణ్ బరువెక్కిన గుండెలతో, భారమైన అడుగులు వేశాడు బయటికి.

★